## హెచ్‌ఎండీఏ మెట్రో పాలిటన్ కమిషనర్‌గా దాన కిశోర్

- మొదటిసారిగా ఒక సంస్థకు ఇద్దరు ఐఏఎస్ అధికారులు
- హెచ్‌ఎండీఏ పరిధిలో అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- మహానగర విస్తరణ అంతా హెచ్‌ఎండీఏ పరిధిలోనే..

సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణలో హెచ్‌ఎండీఏ ఎంతో కీలకం. మాస్టర్‌ప్లాన్ రూపకల్పన నుంచి మొదలుకొని వివిధ మౌలిక వసతుల ప్రాజెక్టులు, కొత్త లే అవుట్లు, భారీ బహుళ అంతస్తుల నిర్మాణాల అనుమతులు, పట్టణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడం... అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్, ఔటర్ రింగు రోడ్డు... ఇలా ఎన్నో రకాల కార్యకలాపాలు చేపడుతున్న హెచ్‌ఎండీఏపై కొత్త ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిని సారించింది. ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్‌గా, పురపాలక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారి 2019 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. అలాంటి స్థానంలో కొత్త ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి స్థాయి కలిగిన ఐఏఎస్ అధికారిని హెచ్‌ఎండీఏ మెట్రో పాలిటన్ కమిషనర్‌గా దాన కిశోర్‌ను నియమించగా, రెండు రోజుల కిందట కార్యదర్శి స్థాయి అధికారిణి అయిన ఆమ్రపాలిని హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా నియమించింది. 4 ఏండ్లుగా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారి స్థానంలో ఒకేసారి ఇద్దరిని నియమించడం ద్వారా ప్రభుత్వం హెచ్‌ఎండీఏకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఔటర్ రింగు రోడ్డు లోపల ఉన్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కంటే హెచ్‌ఎండీఏ పరిధిలోనే భవిష్యత్ అభివృద్ధికి ఎక్కువ అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే నగర శివారు ప్రాంతాల్లో పట్టణీకరణతో పాటు మెరుగైన మౌలిక వసతుల కల్పన విషయంలో సమగ్రంగా అధ్యయనం చేయడంతో పాటు కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు సమర్థవంతమైన అధికార యంత్రాన్ని నియమించినట్లు తెలుస్తోంది.

### భవిష్యత్‌లో రీజినల్ రింగు రోడ్డు...

గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు తరహాలోనే 7 జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న హెచ్‌ఎండీఏ పరిధి చుట్టూ ప్రాంతీయ వలయ రహదారి( రీజినల్ రింగు రోడ్డు–ఆర్‌ఆర్‌ఆర్) నిర్మాణ ప్రతిపాదనలు పురోగతిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డుల మధ్య ఉన్న ప్రాంతంలో పట్టణీకరణ ఎలా ఉండాలన్న దానిపై ప్రత్యేక అధ్యయనం చేయనున్నారు.

### జలమండలి ఎండీగా సుదర్శన్‌రెడ్డి

జలమండలి ఎండీగా సుదర్శన్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన బదిలీల్లో భాగంగా 2002 బ్యాచ్‌కు చెందిన సి. సుదర్శన్‌రెడ్డిని ఎంఏయూడీ సెక్రటరీ నుంచి జలమండలికి బదిలీ చేసింది. జలమండలిలో సుదీర్ఘ కాలంపాటు పనిచేసిన ఎండీ దానకిశోర్‌ను పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది.

## మేయర్ సీటిస్తే.. రూ.2 కోట్లు ఇస్తా..

### ఒక్కో కార్పొరేటర్‌కు రూ. 15 లక్షల వరకు..

### 23వ డివిజన్ కార్పొరేటర్ సంతోషీ శ్రీనివాస్‌రెడ్డి ఆఫర్

బడంగ్‌పేట, డిసెంబర్ 17: 'బడంగ్‌పేట మేయర్ పదవికి ఎసరు' అన్న కథనం 'నమస్తే'లో ఆదివారం ప్రచురితం కావడం చర్చనీయాంశంగా మారింది. ఎలాగైనా మేయర్‌పై అవిశ్వాసం పెట్టాలని మెజార్టీ సభ్యులు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. మేయర్ అభ్యర్థిగా ఎవరైతే బాగుంటుందని కార్పొరేటర్లు సమాలోచనలు చేస్తున్నారు. తప్పనిసరిగా మార్పు జరగాల్సిందేనని మెజార్టీ కార్పొరేటర్లు ఒక అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఏ పార్టీకి ఎంత మంది మద్దతు ఉందని లెక్కలు వేసుకున్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి 14 మంది కార్పొరేటర్లు ఉండగా, బీజేపీకి 10 మంది, కాంగ్రెస్‌కు ఏడుగురు, స్వాతంత్ర అభ్యర్థి ఒకరు ఉన్నారని లెక్కలు వేసుకున్నారు. మేయర్ పదవి వస్తుందంటే కొందరు పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తున్నది. అవిశ్వాసం పెట్టడం వల్ల కార్పొరేటర్లకు బంఫర్ ఆపర్ ప్రకటిస్తున్నారు. పది లక్షల నుంచి 15 లక్షలకు వరకు కార్పొరేటర్లకు ఇస్తారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎవరు ఎక్కువ డబ్బులు ఇస్తే వారికి మద్దతు ప్రకటిస్తామని, కొందరు కార్పొరేటర్లు బహిరంగంగానే చెబుతున్నారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు అంతర్గతంగా మేయర్ పీటం దక్కించుకోవాలని ప్రణాళికలు రచించుకుంటున్నారు.

### మేయర్ పదవికి సహకరిస్తే.. రెండు కోట్లు..

23వ డివిజన్ కార్పొరేటర్ రాళ్లగూడెం సంతోషీ శ్రీనివాస్‌రెడ్డి మాత్రం ఒక అడుగు ముందుకు వేసి.. తనకు మేయర్ పదవికి సహకరిస్తే రెండు కోట్లు ఇస్తానంటూ బంఫర్ ఆఫర్ ప్రకటిస్తున్నారు. లేదంటే ప్రతి కార్పొరేటర్‌కు 10 నుంచి 15 లక్షల చొప్పున ఇస్తానని ఓపెన్ ఆఫర్ ఇస్తున్నారు. దీంతో బడంగ్‌పేట మేయర్ అవిశ్వాసం హాట్ టాఫిక్‌గా మారింది. రెండు మూడు రోజుల్లో కొందరు కార్పొరేటర్లు సమావేశం కానున్నట్లు తెలిసింది. ఎలాగైనా ఒక్కసారి మేయర్ పీటం దక్కించుకోవాలన్న ఆలోచనలో రాళ్లగూడెం సంతోషీ శ్రీనివాస్‌రెడ్డి ఎత్తులకు పై ఎత్తులు వేసుకుంటున్నారు. కార్పొరేటర్లు ఒకరితో ఒకరు ఫోన్‌లో మాట్లాడుకున్నట్లు తెలిసింది. కార్పొరేటర్లు అందరూ అవిశ్వాసం పెట్టాలన్న అంశానికే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. జనవరిలో మార్పు తప్పదని చర్చించుకుంటున్నారు.

## అన్నార్తుల ఆకలి తీర్చేందుకు వాక్ ఫర్ హంగర్




ఖైరతాబాద్, డిసెంబర్ 17: అన్నార్తులు, అనాథల ఆకలి తీర్చడమే లక్ష్యంగా ఏఎన్‌వీఎస్‌ఏ సంస్థ నడుం బిగించింది. ఆదివారం నెక్లెస్‌రోడ్‌లోని జల విహార్ వద్ద ఆ సంస్థ ఆధ్వర్యంలో 'వాక్ ఫర్ హంగర్' పేరుతో వాకథాన్‌ను నిర్వహించింది. ఈ వాకథాన్‌ను స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ హెచ్‌ఓడీ డాక్టర్ ఆర్ వైదేహీ, ఏఎన్‌వీఎస్‌ఏ ప్రతినిధులు శ్రీరామ్, శివ, ప్రసాద్, హరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ... ప్రపంచ ఆకలి సూచికలో 125 దేశాల్లో భారతదేశం 111వ స్థానంలో నిలిచిందంటే దేశంలో ఆకలి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందన్నారు. ఓ సర్వే రిపోర్టు ప్రకారం 20 కోట్ల మందికిపైగా ప్రజలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారని తెలిపారు. 25 లక్షల మంది సరైన ఆహారం దొరక్క ఆకలితో మరణిస్తున్నారని చెప్పారు. అందులో ఎక్కువ శాతం ఐదు సంవత్సరాలు నిండని పిల్లలే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదన్న సూత్రాన్ని పాటిస్తూ ఏఎన్‌వీఎస్‌ఏ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాల ద్వారా వచ్చిన మొత్తంతో ఐదు లక్షల మంది ఆకలి తీర్చాలని సంకల్పించామన్నారు. ఈ కార్యక్రమాన్ని దేశంలోని 4,126 నియోజకవర్గాల్లో చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ డి.శ్రావణి, డాక్టర్ కేఎల్ వసుంధర, లైబ్రేరియన్ ఎం.మాధవి, విద్యార్థినీ, విద్యార్థులు, యువతీ యువకులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై వాకథాన్



సిటీబ్యూరో, డిసెంబర్ 17 (నమస్తే తెలంగాణ): శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా కర్ణాటక బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం అధికారులు ఆదివారం వాకథాన్ నిర్వహించారు. సైబర్ మోసాలు, సైబర్ భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కర్ణాటక బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కేఎల్. శేషాద్రి, మజాజ్ అలియాంజ్, అధికారి అనిల్ ప్రారంభించారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద నిర్వహించిన వాకథాన్‌లో శేషాద్రి మాట్లాడుతూ.. కర్ణాటక బ్యాంకు అందించే సేవలను ప్రజలకు వివరించారు.

## ఇంధనాన్ని పొదుపు చేద్దాం



అవగాహన వాక్‌లో టీఎస్ రెడ్‌కో వైస్ చైర్మన్ జానయ్య, డాక్టర్ వెంకట సుబ్బయ్య

ఖైరతాబాద్, డిసెంబర్ 17: జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా తెలంగాణ స్టేట్ సెంటర్, ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ ఆధ్వర్యంలో అవగాహన వాక్ నిర్వహించారు. విశ్వేశ్వరయ్య భవన్ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వరకు నిర్వహించిన ఈ వాక్‌ను టీఎస్ రెడ్‌కో వైస్ చైర్మన్ జానయ్య, ఐఈఐ చైర్మన్ డాక్టర్ జి.వెంకట సుబ్బయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంధన పొదుపు ఆవశ్యకతపై అవగాహన కల్పించేందుకు వాక్ నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఈఐ కార్యదర్శి కె.సీతారాం బాబు, ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ కన్వీనర్ ప్రొఫెసర్ మహ్మద్ మోయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలి

### మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

### గచ్చిబౌలిలో ఘనంగా 'రెసోఫెస్ట్-2023'



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం

శేరిలింగంపల్లి, డిసెంబర్ 17: జాతీయ నూతన విద్యా విధానాన్ని అన్ని విద్యా సంస్థల్లో అమలు చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో రెసోనెన్స్ విద్యాసంస్థలకు చెందిన 'రెసోఫెస్ట్–2023' ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకయ్యనాయుడు చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. మనిషి జీవితంలో విద్య కీలకమైనదని, మానవాళి మనుగడ విద్యతోనే సాధ్యమన్నారు. కష్టపడే తత్వం, క్రమశిక్షణ, సమయపాలన సుగుణాలను అలవరుచుకున్నప్పుడే చదువులో రాణిస్తారన్నారు. ఆంగ్లం ఇతర భాషల్లో ప్రావీణ్యంతో పాటు మాతృభాషను మాత్రం మరవద్దని కోరారు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా కన్నతల్లి, మాతృభాష, జన్మభూమిలను మరచిపోవద్దన్నారు. టెక్నాలజీ అవసరమైనప్పటికీ మితిమీరిన వినియోగం అనర్థాలకు దారితీస్తుందని, చదువులపై ప్రభావం చూపే సెల్‌ఫోన్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతి సాంప్రదాయలకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. భారతీయ వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని అన్ని విద్యాసంస్థల్లోనూ జాతీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. ప్రముఖ హాస్యనటుడు, పద్మశ్రీ బ్రహ్మానందం మాట్లాడుతూ చదువుతోనే మనిషికి సార్థకత లభిస్తుందన్నారు. ఏదైనా సాధించాలనే తపనతో పాటు అలుపెరగని ఆత్మస్థైర్యంతో చేసే ప్రయత్నం విజయాలకు చేరువ చేస్తుందన్నారు. రెసోనెన్స్ విద్యాసంస్థల డైరెక్టర్ పూర్ణచంద్రరావు, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్‌కే వర్మలతో పాటు పలువురు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### సీఎండీని కోరిన ఉద్యోగుల సంఘం నాయకులు



బంజారాహిల్స్, డిసెంబర్ 17: విద్యుత్ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు కరణం ప్రమోద్‌తో పాటు ఇతర యూనియన్ నాయకులు ట్రాన్స్‌కో అండ్ జెన్‌కో సీఎండీ సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీని కోరారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన సీఎండీ రిజ్వీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన సందర్భంగా కరణం ప్రమోద్ మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశలో ప్రయత్నాలు చేస్తామని, రాష్ట్ర అభివృద్ధిలో విద్యుత్ శాఖ ఉద్యోగులు కీలక పాత్ర పోషించాల్సిన అవసరమున్నదని సీఎండీ అభిప్రాయపడ్డారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండీ వజీర్, రాధాకృష్ణ, లింగం, జెన్‌కో వైస్ ప్రెసిడెంట్ లవకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.